క్లుప్తంగా

ఆర్‌ఎంపీల ఇళ్లపై డ్రగ్స్ అధికారుల దాడులు

● రూ.35వేల విలువైన మందుల పట్టివేత



ఎల్కతుర్తి : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో గురువారం ఆర్‌ఎంపీల ఇళ్లపై డ్రగ్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన చిదురాల మార్కండేయ అనే ఆర్‌ఎంపీ వద్ద 25 రకాల మందులతోపాటు సుమారు రూ.10వేల విలువచేసే ఇతర మందులను స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ డ్రగ్స్ అడిషనల్ ఏడీ రాజ్యలక్ష్మి తెలిపారు. అలాగే మరో ఆర్‌ఎంపీ మధుకర్ గౌడ్ వద్ద సుమారు రూ.25 వేల విలువచేసే మందులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వరంగల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, అరుణ్‌కుమార్ దాడుల్లో పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



పరకాల : పీఎం విశ్వకర్మ పథకం దరఖాస్తులు చేసేందుకు సీఎస్‌సీ సెంటర్‌కు అవకాశం కల్పించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ ఆర్‌పీ జయంత్‌లాల్ కోరారు. గురువారం పట్టణంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందించారు.

'పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయండి'

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ ఏబీఎస్‌ఎఫ్, స్వేరోస్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు బొట్ల నరేశ్, శనిగరపు రాజేంద్రప్రసాద్ సమస్యలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, ప్రసాద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సైకిళ్లు అందజేత

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం హైస్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ కేబిన్ డైరెక్టర్ మహ్మద్ రఫీ గురువారం సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవీందర్ మాట్లాడారు. ఎంపవరింగ్ గర్ల్ స్టూడెంట్ విత్ బైస్కిల్స్‌లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థినిలకు ఉపాధ్యాయుడు పెరుగు శ్రీనివాస్ సూచన మేరకు సైకిళ్లు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయప్రకాశ్, శ్రీదేవి, రమేశ్, నాగమణి, అశోక్, జాహెద్ అలీ పాల్గొన్నారు.

సన్మానం

గీసుకొండ : మండలంలోని మనుగొండ యూపీహెచ్‌సీ ఎస్‌జీటీ శైలజాదేవిని ఉద్యోగ విరమణ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన వీడ్కోలు సభకు శ్రీపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని చెప్పారు. శైలజాదేవి నిబద్ధతతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సాంబయ్య, పీఆర్‌టీయూ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కార్యదర్శి శ్రీహరి, హెచ్‌ఎంలు పట్టాభి, రజాక్, రవీందర్, ఏఏసీసీ చైర్‌పర్సన్ స్రవంతి పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

పర్వతగిరి : నర్సంపేటలో నేటి (శుక్రవారం) నుంచి రెండ్రోజులపాటు సీపీఎం జిల్లా 20వ మహాసభలు నిర్వహిస్తామని ఆ పార్టీ మండల కార్యదర్శి మాదాసి యాకూబ్ తెలిపారు. మండల కేంద్రంలో జిల్లా రమేశ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేలా అనేక పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహాసభల్లో భవిష్యత్ పోరాట కార్యాచరణకు రూపకల్పన చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పోడేటి దయాకర్, ఆబర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలను వినియోగించుకోవాలి

కాజీపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత, బీమా పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ ఎఫ్‌ఎల్‌సీ జిల్లా కౌన్సిలర్ భాస్కరాచారి సూచించారు. కాజీపేట మహిళా సమాఖ్య భవనంలో శ్రీధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు.

రహదారులే వరి కల్లాలు..



కామారం సమీపంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం



ఆత్మకూరు సమీపంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

- రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్న రైతులు
- ప్రమాదకరంగా దారులు
- పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో కల్లాలు లేకపోవడంతో రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారు. దీంతో ద్విచక్రవాహనదారులతో పాటు ఇతర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఆత్మకూరు నుంచి వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కి వెళ్లే రోడ్డు మార్గంలో కామారం, పెద్దాపురం, అక్కంపేట తదితర గ్రామాల్లో, ఆత్మకూరు నుంచి శాయంపేటకు వెళ్లే రోడ్డు మార్గంలో కూడా ఇదే ధాన్యాన్ని ఆరబోశారు. వాహనదాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇలా రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన అనేక ప్రమాదాలు జరిగి పలువురు వాహన చోదకులు తీవ్రగాయాల పాలయ్యారు. మళ్లీ ఈ సీజన్‌లో కూడా రోడ్లన్నీ ప్రమాదకరంగా తయారయ్యాయని, రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. రైతులకు గ్రామాల్లో ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఈ సందర్భంగా వాహనదారులు కోరుతున్నారు.

కల్లాలు నిర్మించాలి



రైతులు ధాన్యం ఆరబోసుకునేందుకు గ్రామాల్లో కల్లాలు నిర్మించాలి. స్థానికంగా కల్లాలు లేకపోవడంతో రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

- ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, పెంచికలపేట

ప్రమాదాలను నివారించాలి



రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో బైక్‌తో రోడ్లపై వెళ్లాలంటే భయం వేస్తుంది. రోడ్డుపై ధాన్యం ఆరబోసుకోకుండా అవగాహన కల్పించాలి. రైతుల కష్టాలను తొలిగించేందుకు ప్రభుత్వం, అధికారులు కల్లాలను ఏర్పాటు చేయాలి.

- బయ్యి పైడి , ఆత్మకూరు

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆంజనేయులు

ధర్మసాగర్ : విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని నిట్ ప్రొఫెసర్ ఆంజనేయులు సూచించారు. మండలంలోని ఉనికిచర్ల ఎస్‌ఆర్ సీఎస్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ పద్ధతిలో ఆలోచించినప్పుడు అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. క్రీడలు మానసిక ప్రశాంతతకు, జట్టు భావనను పెంపొందించి రోజువారి సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతాయని మరో ప్రొఫెసర్ రవికుమార్ తెలిపారు. దాదాపు 14 మండలాల నుంచి 143 మంది విద్యార్థులు పాల్గొనట్లు ప్రొఫెసర్ రాములు తెలిపారు. తెలుగు మీడియం విభాగంలో ఫాతిమా బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ పాఠశాల విభాగంలో వేలేరు మండలం పీచర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల విభాగంలో వర్ధన్నపేటలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల బాలురు, ప్రైవేటు పాఠశాలల విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. డిసెంబర్ 14,15,16 తేదీల్లో ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌సీఎస్ చైర్మన్ రాజిరెడ్డి అధ్యక్షత వహించగా భిక్షపతి, ధర్మప్రకాశ్, కుమారస్వామి, దయాకర్, వేణు క్విజ్ మాస్టర్లుగా వ్యవహరించారు. ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, కుమారస్వామి, అశోక్, భిక్షపతి, వందన పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల రాస్తారోకో



పరకాల : పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ ఆరోపించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులు మృతిచెందడాన్ని నిరసనగా పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఫుడ్‌పాయిజన్‌కు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యానికి గురైన విద్యార్థుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేశారు.

దురాచారాలను పారదోలిన జ్యోతిబా పూలే



ఐనవోలు : పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు



ఎల్కతుర్తి : పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



పరకాల : జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఐనవోలు : దురాచారాలను మహాత్మా జ్యోతిబా పూలే పారదోలారని కేవీపీఎస్ నాయకులు కొనియాడారు. గురువారం పూలే వర్ధంతిని మండలంలోని వెంకటాపురం గ్రామంలో నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి గబ్బెట రాంకుమార్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల, మహిళల అభివృద్ధి కోసం పోరాడిన మహనీయుడు పూలే అని అన్నారు. కుల వివక్ష, అంటరానితరం, స్త్రీ, పురుషులకు సమాన హక్కులు లేకపోవడం, సాంఘిక దురాచారాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనేక ఉద్యమాలు చేశారని కొనియాడారు. నాయకులు వెంకటస్వామి, యాకయ్య, నారాయణరెడ్డి, నర్సయ్య, కుమార్, ఉప్పలయ్య, వెంకన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో గురువారం మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి జరిగింది. పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, అంబేడ్కర్ వాది పెరుమాండ్ల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ జంపయ్య, ప్రభాకర్, శ్రీనివాస్, పైడయ్య పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలతో పాటు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మున్నూరుకాపు సంఘం, బహుజన సంక్షేమ సంఘం, కేవీపీఎస్, దళిత సంఘం, పత్తిపాకలో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రజని, వివిధ సంఘాల సభ్యులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. దళిత సంఘం నాయకులు మారేపల్లి సుధాకర్, రంగుబాబు, సదయ్య, పూలే యువజన సంఘం గౌరవ సలహాదారు పవన్ కల్యాణ్, అధ్యక్షుడు వికాస్, రిజ్వాన్, సాంబరాజు, బీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు సుమన్, కేవీపీఎస్ మండల కార్యదర్శి రమేశ్, నాయకులు కొమురయ్య, సురేష్‌కుమార్, కుమారస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు,

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతిని గురువారం కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు నిర్వహించారు. పూలే చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఇంద్రసేనారెడ్డి, సంతాజీ, రాజేశ్వర్‌రావు, అక్తర్‌అలీ, పున్నంచందర్, సురేందర్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్‌గుప్తా, ప్రమోద్‌రెడ్డి, భిక్షపతి, రవీందర్, ప్రకాశ్, అనిల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరకాల : ప్రజాసంక్షేమ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జ్యోతిబా పూలే వర్ధంతిని నిర్వహించారు. అధ్యక్షుడు మడికొండ రఘుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొని పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.



ఆత్మకూరు : నివాళులర్పిస్తున్న నాయకులు



శాయంపేటలో..



ఎల్కతుర్తి : ముల్కనూరులో..

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు గురువారం వెంకటేశ్వర్లు మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్‌ఎస్సై వరంగంటి మాధవరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన కట్కూరి సరోజన, మాచర్ల బాలరాజు నివాసాలకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అలాగే ఐనవోలు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాటబోయిన వెంకటయ్య, బేతి సమ్మిరెడ్డి, గాదె ఏలియా ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చరు. అదే గ్రామానికి చెందిన కొత్తూరు ప్రతాప్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను పరామర్శించారు. అదే విధంగా నర్సింహులగూడెం గ్రామానికి చెందిన మైదం రజిత, మైదం సంధ్య, కట్కూరి మమత ఇటీవల మృతిచెందగా ఆయా కుటుంబాలను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన కట్కూరి బాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతడిని పరామర్శించారు. ప్రతీ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే నాగరాజు రూ.5 వేల అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల సాయం

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన నక్క ప్రశాంత్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

వేలేరులో..

వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన కరట్లపల్లి జమున(50) ప్రమాదవశాత్తు నీటితొట్టిలో పడి గురువారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వెంకటశ్రీ స్టోన్ క్రషర్ యాజమాని శ్రీకాంత్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు అతడి ప్రతినిధి రవికిరణ్‌రెడ్డి ద్వారా రూ.5వేల నగదు, 50 కిలోల బియ్యం అందించారు.

దీక్షాదివస్‌ను జయప్రదం చేయాలి

దామెర : దీక్షాదివస్‌ను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన నవంబర్ 29 సందర్భంగా హనుమకొండ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షాదివాస్ చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009 నవంబర్ 29న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గురువారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు చేపట్టే దీక్షదివాస్‌ను జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

దుర్గామాత ఆశీస్సులు ప్రజలపై ఉండాలి



దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

● ఎమ్మెల్యేలు కడియం, పల్లా

వేలేరు : దుర్గామాత ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని షోడాషపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయం, విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. నూతనంగా ప్రతిష్ఠించిన దుర్గామాతను జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చాడ సరిత, మండల ఇంచార్జ్ భూపతిరాజు, మండల కో ఆర్డినేటర్ గోవింద సురేష్, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్ర పూజలు



మంగళ సూత్రాలను చూపుతున్న అర్చకులు



సుదర్శన నారసింహ హవన పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆచార్యులు వెంకటరత్నం

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని శ్రీలక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాలు, పండ్ల రసాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పూర్తైన తర్వాత ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. అదే విధంగా అర్చకులు సుదర్శన నారసింహ హోమం వేదోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ-నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం జరిపించారు. నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పించారు. ఆచార్యులు వెంకటరత్నం, జయకృష్ణ, అరుణ్‌కుమార్, నాగేంద్రతో పాటు స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమల సమస్యలు పరిష్కరించాలి

● మండల అధ్యక్షుడు సురేందర్



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : రాష్ట్రంలోని గొల్ల, కురుమల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం మండల అధ్యక్షుడు కడారి సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్‌కు వినతిపత్రం అందించారు. ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లో గొల్ల, కురుమలకు రెండు లక్షలు నగదు బదిలీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గొర్రెలకు నట్టల మందులు, వెటర్నరీ ఆస్పత్రులకు సరిపడా మందులు సరఫరా చేయాలని వినతిలో కోరారు. 50 సంవత్సరాలు నిండిన గొల్ల, కురుమలకు పింఛన్ ఇవ్వాలని, గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా ఇన్‌స్రూ చేయాలని డిమాండ్ చేశారు. కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెల కాపర్ల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధానకార్యదర్శి రమేశ్, సమ్మయ్య, ఇస్తారి, పున్నంచందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సుమన్ కుమార్

ధర్మసాగర్ : ఈనెల 30 నుంచి హనుమకొండ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారపు సుమన్‌కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం మాదిగల మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 30 నుంచి డిసెంబర్ 04వ తేదీ వరకు హనుమకొండ నియోజక వర్గం, 05 నుంచి 09 వరకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం, 15 నుంచి 19 వరకు వర్ధన్నపేట నియోజకవర్గం, 20 నుంచి 24 వరకు హుజూరాబాద్ నియోజక వర్గం, 26 నుంచి 30వ తేదీ వరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో స్కూటర్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో జిల్లా వ్యాప్తంగా జిల్లాస్థాయి నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల కన్వీనర్లు, మండల, గ్రామస్థాయి నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు వెంకన్న, బాలస్వామి, కోమల, గోపి, రాజ్‌కుమార్, యశ్వంత్, తిరుపతి, రవీందర్, అరుణ్, రవీందర్, రాజు, మోహన్, పుష్పమాల, ప్రభావతి పాల్గొన్నారు.

ఉపాధికి వృత్తి విద్య దోహదం

● డీఈఓ వాసంతి



సర్టిఫికెట్లు అందజేస్తున్న విద్యార్థినులు

కమలాపూర్ : వృత్తి విద్యతో జీవనోపాధి లభిస్తుందని డీఈఓ వాసంతి అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో చదువుకుంటూ గతేడాది దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందిన ఒకేషనల్ విద్యార్థినులకు ప్రభుత్వం నుంచి వచ్చిన సర్టిఫికెట్లను గురువారం ఆమె అందించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ విద్యార్థినులు దివ్య, సిరివెన్నెల, అక్షయ, సిరిచందన, మనీషా (మీడియా ఎంటర్‌టైన్‌మెంట్), ధనశ్రీ, సుప్రియ, నవ్యశ్రీ (కుట్టు శిక్షణ) తదితరులు డీఈఓ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థినులు వృత్తి విద్యలు నేర్చుకోవాలని, వృత్తి విద్య జీవనోపాధికి తోడ్పతుందని డీఈఓ సూచించారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత, వృత్తి విద్య శిక్షకులు బిట్ల ప్రవీణ్, లీనా, ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేపిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

నడికూడ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు టీచర్ సంపూర్ణ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేపట్టారు. సూపర్‌వైజర్ కందుల శ్రీదేవి అక్షరాలు దిద్దించారు. పిల్లల తల్లిండ్రులు, అంగన్‌వాడీ టీచర్స్ సంపూర్ణ, కళావతి, వినోద, ఆయాలు నర్సమ్మ, మేరీ, సుజాత పాల్గొన్నారు.

నేడు కొత్తకొండకు మంత్రి రాక

ఎల్కతుర్తి : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శుక్రవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండకు రానున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కొత్తకొండలోని గుట్టపై మెట్ల దారికి శంకుస్థాపన, అనంతరం హెల్త్ సబ్‌సెంటర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.